అభివృద్ధి పనుల పరిశీలన



నాచారంలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌శేఖర్‌

మల్లాపూర్‌: సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాచారం కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌శేఖర్‌ అన్నారు. సోమవారం నాచారం వార్డు కార్యాలయం నుంచి కల్లు కాంపౌండ్‌, భక్త సమాజ్‌ నుంచి పోచమ్మ గుడి, తార్నాక బార్డర్‌ వరకు రూ.65 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్‌ పరిశీలించారు. గత 30 ఏళ్ల తర్వాత సీసీరోడ్డు పనులు చేపట్టడంతో స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తంచేస్తూ.. కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. పోచమ్మ దేవాలయం నుంచి ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీహాల్‌ వరకు రోడ్డు వేయనున్నట్లు స్థానికులకు హామీ ఇచ్చారు. ఏఈ స్రవంతి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ విజయ్‌కుమార్‌, ముత్యంరెడ్డి, భూపాల్‌రెడ్డి, విఠల్‌యాదవ్‌, రాంచందర్‌, రమణారెడ్డి, గణేష్‌, కట్టబుచ్చన్నగౌడ్‌ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మేడ్చల్‌: ఎస్‌డీఎఫ్‌ చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ దీపిక నర్సింహారెడ్డి కౌన్సిలర్‌ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. రూ. 18 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీలలో పచ్చదనం పెంపొందించడానికి కాలనీవాసులు వనమహోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆమె కోరారు. కాలనీలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

భారీ వర్షం..

రహదారులు జలమయం

- వాహనదారులకు తీవ్ర ఇబ్బంది
- జనజీవనం అస్తవ్యస్తం

వరంగల్‌ జాతీయ రహదారిపై నిలిచిన వరదనీరు



హైవేపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

మల్లాపూర్‌: తెల్లవారుజామున కురిసిన వర్షానికి మల్లాపూర్‌లోని గ్రీన్‌హిల్స్‌ కాలనీ, ఈస్ట్‌ అన్నపూర్ణ కాలనీ, భవానీనగర్‌లోని పలు ప్రాంతాల్లో జలమయమయ్యాయి. బాక్స్‌ డ్రైనేజీ నాలా మ్యాన్‌హోల్స్‌ నుంచి మురుగు, వరద నీరు లోతట్టు ఇళ్ల ముందు చేరడంతో బురద మయం కాగా.. కాలనీవాసులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ముంచెత్తిన వరద..

ఉప్పల్‌: ఉప్పల్‌ వేంకటేశ్వర కాలనీ టెంపుల్‌ రోడ్డు మల్లికార్జుననగర్‌లో కాలనీల్లో ఇళ్లల్లోకి వరద నీరువచ్చి చేరింది. సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి నాలా పొంగి వరద నీరు కాలనీని ముంచెత్తింది. దీంతో కాలనీవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే రంగంలోకి దిగిన కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ అధికారులను అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న డీసీ ఆంజనేయులు, ఈఈ నాగేందర్‌ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వరద నీటిని మళ్లించారు. కాగా నాలాల్లో సరిగ్గా పూడికతీయకపోవడంతోనే వరదనీరు ఇళ్లలోకి వచ్చి చేరుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

పీర్జాదిగూడలో..

మేడిపల్లి: మేడ్చల్‌ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో సోమవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక డ్రైనేజీలు నిండి, మురుగుతో కొన్ని ప్రాంతాల్లో సెల్లార్లు, కాలనీలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. 2వ డివిజన్‌, బండిగార్డెన్‌ రోడ్డు, 26వ డివిజన్‌, సహా పలు డివిజన్లలో వరద నీటితో నిండి పోయాయి. రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక పాదచారులు, వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఈస్ట్‌ అన్నపూర్ణ కాలనీలో నిలిచిపోయిన వరద నీరు





◆ వరంగల్‌ హైవేపై వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ట్రాఫిక్‌ పోలీసులు రంగంలోకి దిగి వాహనాలకు దారి చూపుతూ.. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రోడ్డుపై వరదనీరు నిలవకుండా తగిన చర్యలు చేపట్టారు.



మల్లాపూర్‌ గ్రీన్‌హిల్స్‌ కాలనీలో వరదనీరు ఇలా..

‘ప్రజావాణి’తో సమస్యల పరిష్కారం



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న మేయర్‌



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

బోడుప్పల్‌: ప్రజావాణిలో గుర్తించిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. బోడుప్పల్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సోమవారం ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఆయా శాఖల అధికారులకు పంపి పరిష్కారం చూపుతున్నామన్నారు. మొత్తం 11 దరఖాస్తులు రాగా.. వాటిలో ఇంజినీరింగ్‌ విభాగానికి చెందినవి 10, మేడిపల్లి తహసీల్దార్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్లు వెల్లడించారు. కమిషనర్‌ రామలింగం, అధికారులు పాల్గొన్నారు.

9 ఫిర్యాదులు..

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 9 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి 3 ఫిర్యాదులు, మల్కాజిగిరి కార్పొరేటర్‌ శ్రవణ్‌ నుంచి 6 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు వివరించారు. శానిటేషన్‌ విభాగంలో ఒకటి, రెవెన్యూ విభాగంలో 2, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే.. కార్పొరేటర్‌ వీధి మార్కెట్లలో (తైబజార్ల) వద్ద వ్యర్థాల నియంత్రణ, ఇంజినీరింగ్‌ విభాగం చేపట్టే పనుల్లో నాణ్యతలోపం, రెవెన్యూ విభాగంలో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని, అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు, వీధిదీపాల నిర్వహణ అధ్వాన్నంగా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డీసీ రాజు కార్పొరేటర్‌కు వివరించారు.

ఉప్పల్‌: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన ప్రజావాణికి 6 ఫిర్యాదులు అందినట్లు డిప్యూటీ కమిషనర్‌ ఆంజనేయులు తెలిపారు.



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

ముఖ్యంగా సోమవారం టౌన్‌ ప్లానింగ్‌ విభాగం, ఇంజినీరింగ్‌ విభాగం, టాక్స్‌ విభాగాల నుంచి ఫిర్యాదులు అందినట్లు వివరించారు. చిలుకానగర్‌ డివిజన్‌, ఆనందర్‌నగర్‌లో రెండు ఫిల్లర్ల స్థలంలోనే 6 అంతస్తులు నిర్మిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని డీసీ స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి..

అల్వాల్‌: అల్వాల్‌ లోతుకుంటలోని పార్కుతో సహా డివిజన్‌లోని అన్ని పార్కులను అభివృద్ధి చేయాలని కోరుతూ అల్వాల్‌ సర్కిల్‌ ప్రజావాణిలో కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి సోమవారం డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మల్లేష్‌గౌడ్‌, శరన్‌గిరి, హన్మంతు తదితరులున్నారు.

రోడ్లు వేయాలని..

అల్వాల్‌ సర్కిల్‌ మచ్చబొల్లారం డివిజన్‌లోని ఎంహెచ్‌ఆర్‌ కాలనీలో రోడ్లు వేయించాలని కోరుతూ సోమవారం అల్వాల్‌ సర్కిల్‌ కార్యాలయంలోని ప్రజావాణిలో డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌ కాలనీ నూతన కమిటీ ఎన్నికలు

బోడుప్పల్‌: లక్ష్మీనగర్‌ (హుడా కాలనీ) అసోసియేషన్‌ ఎన్నికల్లో అమర్‌లింగారెడ్డి, చెన్నారెడ్డి ఫానెల్‌, మేక రాంరెడ్డి ఫానెల్‌ పోటీ చేశాయి. ఈ పోటీల్లో అమర్‌లింగారెడ్డి, చెన్నారెడ్డి ప్యానల్‌ విజయం సాధించింది. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా నవీన్‌రెడ్డి, కోశాధికారిగా రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా అరవింద్‌, ఆర్‌.వీ.చారి, ఎగ్జిక్యూటివ్‌ సభ్యులుగా డాక్టర్‌ రంజిత్‌, కునాల్‌, జగన్‌మోహన్‌రెడ్డి, జై కుమార్‌, మక్కా రమేష్‌, జాన్‌ ఫిలిప్స్‌ ఎన్నికయ్యారు. గెలుపొందిన వారిని అమర్‌లింగారెడ్డి, చెన్నారెడ్డి అభినందించారు.

మార్షల్‌ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

మల్కాజిగిరి: గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ ఓపెన్‌ మార్షల్‌ ఆర్ట్‌ చాంపియన్స్‌ పోటీలో డీఏవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని, కరాటే మాస్టర్‌ కుమారస్వామి తెలిపారు. కీర్తన కుమ్మి, కట విభాగాల్లో బంగారు పతకం, తనయ్‌ కట విభాగంలో కాంస్య పతకం సాధించారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న యువదళ్‌ సభ్యులు

మల్లాపూర్‌: మల్లాపూర్‌ యువదళ్‌ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌ జన్మదినం సందర్భంగా సోమవారం మల్లాపూర్‌లోని అనాథ ఆశ్రమంలో యువదళ్‌ సభ్యులు అన్నదానం చేశారు. అనంతరం యువదళ్‌ సభ్యుల సమక్షంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. యువదళ్‌ సభ్యుడు ఎండీ హైదర్‌ పాల్గొన్నారు.

అభినందన



సుమన్‌రావును అభినందిస్తున్న కార్పొరేటర్లు

రామంతాపూర్‌: ప్రధాన రహదారిలోని ఎస్‌ఎస్‌ఆర్‌ స్కై సిటీ అపార్టుమెంట్‌ సముదాయానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఎస్‌.సుమన్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హబ్సిగూడ డివిజన్‌ కార్పొరేటర్‌ కక్కిరేణి చేతన హరీష్‌, రామంతాపూర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ బండారు శ్రీవాణి వెంకట్‌రావు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. పలువురు అపార్టుమెంట్‌ వాసులు పాల్గొన్నారు.

ఫలహారం బండ్ల ఊరేగింపు

మల్లాపూర్‌: ఓల్డ్‌ మల్లాపూర్‌లోని శాంతి యూత్‌ క్లబ్‌ ప్రతినిధి ఎస్వీ శశి ఆధ్వర్యంలో ఫలహారం బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్వీ శివకుమార్‌, పీఆర్‌.ప్రవీణ్‌, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, సంతోష్‌యాదవ్‌, వెంకట్‌, ఎస్వీ శ్రీనివాస్‌, రఘు, మెఘారాజ్‌, ప్రేమ్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ మల్లాపూర్‌ మల్లికార్జున్‌నగర్‌కాలనీలో మహంకాళి యూత్‌ సభ్యులు పరమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫలహారం బండిని ఊరేగించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. ప్రతాప్‌రెడ్డి, సూర్యం శివ, సంతోష్‌ యాదవ్‌, సాయి, నరేష్‌రెడ్డి, నాగ రాజు, ఈశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు.



మల్లికార్జున్‌నగర్‌ కాలనీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్‌ దేవేందర్‌రెడ్డి

ఉప్పల్‌ నల్ల చెరువును పరిరక్షించండి



చెరువును మట్టితో నింపి ఇలా..



హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్‌: ఉప్పల్‌లోని నల్లచెరువు మూడు వైపులా కబ్జాకు గురైందని చెరువును కబ్జాల నుంచి కాపాడాలని కోరుతూ సోమవారం హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌కు ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. నల్లచెరువును సుమారు 100 ఎకరాలకు పైగా ఉన్న నల్లచెరువు నేడు సగానికి పైగా కబ్జాకు గురైయిందని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదులో వివరించారు. నల్ల చెరువు ఉప్పల్‌, మేడిపల్లి మండలాల పరిధిలో ఉందని, రెండు మండలాల రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువు కబ్జాకు గురువుతుందని ఆరోపించారు. చెరువు పరిరక్షణకు కమిషనర్‌ ఉప్పల్‌ రానున్నట్లు పరమేశ్వర్‌రెడ్డి వివరించారు.

విద్యార్థినికి అభినందన

బోడుప్పల్‌: కిరణ్‌ ఇంటర్నేషనల్‌ పాఠశాలలో 2021–22 సంవత్సరంలో చదివిన విద్యార్థి విష్ణుప్రియ ఉన్నత చదువులకు యూఎస్‌లోని నాక్స్‌ విశ్వవిద్యాలయంలో సీటు వచ్చింది. దీంతో పాఠశాల వ్యవస్థాపకులు రితేష్‌ విద్యార్థిని ఈ సందర్భంగా అభినందించారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థినికి మంచి యూనివర్సిటీలో సీటు రావడంపై పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.



వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య



లోక్షిత్‌ (ఫైల్‌)

ఉప్పల్‌: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకానగర్‌ ప్రాంతానికి చెందిన సందమ్‌ బిక్షపతి సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి నిద్ర లేచాడు. బాత్‌రూమ్‌లోకి వెళ్తుండగా.. తన కుమారుడు సందమ్‌ లోక్షిత్‌(18) చీరతో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే కిందకు దించి చూడగా.. అప్పటికే కుమారుడు మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి తండ్రి ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

మరోఘటనలో ..



కేతావత్‌ కిరణ్‌కుమార్‌ (ఫైల్‌)

రామంతాపూర్‌ శారదానగర్‌లో నివాసం ఉండే కేతావత్‌ కిరణ్‌ కుమార్‌ (28) పాల వ్యాపారి. కాగా 2017లో స్వగ్రామం నుంచి వచ్చి రామంతాపూర్‌ శారదానగర్‌లో పాల వ్యాపారం ప్రారంభించాడు. కొద్ది రోజులుగా వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు అధికమైనట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కిరణ్‌కుమార్‌ సోమవారం ఉదయం తాను వ్యాపారం చేస్తున్న షాప్‌లో విద్యుత్‌ వైర్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. ఆర్థిక ఇబ్బందులతోనే మృతి చెందినట్లు సోదరుడు ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు





బ్యాడ్జీలతో విద్యార్థులు

బోడుప్పల్‌: విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని లోటస్‌ ల్యాప్‌ పబ్లిక్‌ స్కూల్‌ చైర్మన్‌ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌ లోటస్‌ ల్యాప్‌ పబ్లిక్‌ స్కూల్‌లో జరిగిన స్టూడెంట్‌ క్యాబినెట్‌ ఎలక్షన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎలా జరుగుతాయో అలాగే ఈ ఎన్నికలు జరిగినట్లు వివరించారు. ఎస్‌పీఎల్‌గా అరుణ్‌రెడ్డి, హర్షిత, డీఎస్‌పీఎల్‌గా సాత్విక్‌, దృతి, స్వచ్ఛ భారత్‌ కెప్టెన్‌గా తేజస్విని, స్వచ్ఛ భారత్‌ వైస్‌ కెప్టెన్‌గా ప్రియతమ్‌రెడ్డి, రెడ్‌ హౌస్‌ కెప్టెన్‌గా నిషల్‌, బ్లూ హౌస్‌ కెప్టెన్‌గా వైష్ణవి, గ్రీన్‌హౌస్‌ కెప్టెన్‌గా తేజస్వి, ఎల్లో హౌస్‌ కెప్టెన్‌గా హరిసింగ్‌ ఎన్నికైనట్లు చెప్పారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుషాయిగూడ: విద్యార్థులు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని అక్షర ఇంటర్నేషనల్‌ విద్యాసంస్థల సీఈఓ మదన్‌మోహన్‌ అన్నారు. కుషాయిగూడలోని అక్షర ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో సోమవారం ఇన్వెస్టరీ సెర్మనీ నిర్వహించారు. ఈ సందర్భంగా లీడర్లుగా ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జీలను ప్రదానం చేసి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ రితిక, వైస్‌ ప్రిన్సిపాల్‌, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హిందూ ఐక్యతా ర్యాలీ

మల్కాజిగిరి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని డిమాండ్‌చేస్తూ.. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఆనంద్‌బాగ్‌ క్రాస్‌రోడ్స్‌ నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీలో ప్రతి హిందువు పాల్గొని ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం

ఉప్పల్‌: ఉప్పల్‌ ప్రశాంత్‌నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూదిని రామలింగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా డా.ఎస్‌ విజయమోహన్‌, కార్యదర్శిగా ఎల్‌.క్రిష్ణస్వామి, జాయింట్‌ సెక్రటరీగా సాంబిరెడ్డి, సుబ్బారెడ్డి, కోశాధికారిగా ప్రవీణ్‌ మోముల, జాయింట్‌ ట్రెజరర్‌గా జీఎంవీ నాగేశ్వర్‌రావు, ముత్యంరెడ్డి, మద్రి విజయలక్ష్మి, సభ్యులుగా కె.లక్ష్మీభూమేష్‌, మహ్మద్‌ కుత్బుద్దీన్‌లను ఎన్నుకున్నారు.

రూ. లక్ష విరాళం అందజేత

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు సోమవారం సికింద్రాబాద్‌కు చెందిన భక్తులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. సికింద్రాబాద్‌ మల్కాజిగిరికి చెందిన బలభద్రపాత్రుని సత్యవతీదేవి కుటుంబసభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ. 1,11,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేదపండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ పర్యవేక్షకులు జగదీష్‌ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.

సీపీఆర్‌తో పునర్జన్మ..



బొల్లారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో వైద్యాధికారులు

అల్వాల్‌: బొల్లారం ప్రభుత్వ పాఠశాలలో జీవదూత (పాఠశాల ప్రథమ చికిత్స) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 108 అధికారులు సోమవారం మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో సీపీఆర్‌ విధానాన్ని ఉపయోగిస్తే మనిషికి మరో జన్మను ప్రసాదించవచ్చన్నారు. సీపీఆర్‌ అనంతరం మనిషి స్పృహలోకి రాగానే 108కి ఫోన్‌చేసి ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. దీంతో మనిషికి మరో జన్మను ప్రసాదించినట్లు అవుతుందన్నారు. ఈఎంఆర్‌ఐ సీపీఆర్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 100 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోషం, విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రీన్‌హెల్త్‌ సర్వీసెస్‌ అరుణ్‌కుమార్‌, పార్వతమ్మ, దేవేందర్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై పోలీసుల అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై శేఖర్‌

కుషాయిగూడ: డ్రగ్స్‌ మహమ్మారి బారినపడి బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దని ఎస్సై శేఖర్‌ అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని సిపెట్‌లో సోమవారం చర్లపల్లి పోలీసులు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌ బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్‌ రహిత సమాజం కోసం యువత నడుం బిగించాలని, అప్పుడే డ్రగ్స్‌ నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని ప్రతిజ్ఞ చేయించారు. సిపెట్‌ సిబ్బందితో ఎస్సై నర్సింగరావు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

కుషాయిగూడ: నియోజకవర్గంలోని పాస్టర్లకు అండగా ఉంటానని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిన్న చర్లపల్లిలోని ఓ చర్చి వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాస్టర్ల సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంబీబీఎస్‌ సీటు సాధించి పేదరికంతో చదువుకోలేని పేద విద్యార్థులకు ఐదేళ్ల ఫీజు చెల్లించి చదివిస్తున్నట్లు చెప్పారు. బిషఫ్‌ డాక్టర్‌ విల్సన్‌, బీఆర్‌ఎస్‌ నేతలు మహేష్‌గౌడ్‌, సురేష్‌, బాలరాజు, నయీం, లోక్‌నాథ్‌, రవీందర్‌, వంశీ, ప్రభాకర్‌, పాల్‌ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన వ్యర్థాలు



మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌ స్థలంలో మురుగు ఇలా..

గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌ పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల రైల్వే స్థలాల్లో మురుగు వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో దోమలు, ఈగలు వృద్ధిచెంది మురుగు వ్యర్థాలు దోమలకు ఉత్పత్తి కేంద్రంగా మారుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు సీజనల్‌ వ్యాధులపై ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు అధికారులు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారే తప్పా.. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

డీఈఓ విజయకుమారి

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ఎంపిక కోసం జిల్లాలోని అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల 23 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు.